
# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023

**నేడు గండిలో శ్రావణమాస ఉత్సవం**

శ్రావణ మాసంలో గండి క్షేత్రంలో శనివారం ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. -IIలో..



**ఆ ఇంట..మృత్యుఘోష**

ఆ కుటుంబంలో ఏం జరుగుతోంది? ఉరి వేసుకుని కుమారుడు.. అతడి జ్ఞాపకాలతో తల్లి.. ఆపై తండ్రి దుర్మరణం చెందడం స్థానికులను కలచి వేస్తోంది. -IIలో..

**మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)**

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.170 | రూ.220 |
| రెండోరకం | రూ.90 | రూ.168 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 204 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### 3న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా జూనియర్ బాల,బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక ఈనెల 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు దిలీప్, సాగర్, మురళీధర్ తెలిపారు. స్థానిక మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. 1-1-2007 నుంచి 31.12.2009వతేదీ లోపు పుట్టినవారు అర్హులన్నారు.ఆధార్‌కార్డు, పుట్టినరోజు సర్టిఫికెట్ తమ వెంట తెచ్చుకోవాలని కోరారు. వివరాలకు 95020 74146 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

### పీకేఎం వైస్‌చైర్మన్ బాబర్ బాధ్యతల స్వీకరణ



బాబర్

మదనపల్లె : పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం-ఉడా) వైస్‌చైర్మన్‌గా ఎం.బాబర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ పీకేఎం-ఉడా ఇన్‌చార్జ్ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించేవారు. ఆయన స్థానంలో విజయవాడలోని ఏపీపీఎస్‌సీ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న బాబర్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో బాబర్ పీకేఎం-ఉడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పీకేఎం-ఉడా ప్లానింగ్ ఆఫీసర్ హరిప్రసాద్, టీపీఓ కుముదిని, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ... పీకేఎం-ఉడా ఆధ్వర్యంలోని 18 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 1 నగరపంచాయతీలో ప్రజాసౌకర్యాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

### ప్లానింగ్ ఆఫీసర్‌గా...



పీకేఎం-ఉడా ప్లానింగ్ ఆఫీసర్ హరిప్రసాద్

మదనపల్లె: పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేఎం-ఉడా) ప్లానింగ్ ఆఫీసర్‌గా హరిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హరిప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా మదనపల్లెకు బదిలీ అయ్యారు. గతంలో పీకేఎం-ఉడా ఇన్‌చార్జ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా చిత్తూరుకు చెందిన మధు బాధ్యతలు నిర్వర్తించేవారు. ఆయన స్థానంలో హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

### ఉమ్మడి జిల్లాలో మూడు రైల్వే జంక్షన్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో మూడు స్టేషన్లను రైల్వే జంక్షన్లుగా మారుస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప, ఎర్రగుంట్ల, ఓబులవారిపల్లి స్టేషన్లు ఇక రైల్వే జంక్షన్లుగా మారనున్నాయి. ఈ మూడు రైల్వే స్టేషన్లు రెండు రైల్వే లైన్లు ఉండడంతో ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు.

### ధర్మవరం-మచిలీపట్నం రైలు దారి మళ్లింపు

కడప కోటిరెడ్డి సర్కిల్: ముద్దనూరు-మంగపట్నం స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతుండడంతో ధర్మవరం-మచిలీపట్నం రైలును దారి మళ్లించారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మచిలీ పట్నం-ధర్మవరం (17215) రైలు ఈనెల 4, 5 తేదీల్లో నంద్యాల, డోన్, గుత్తి, ధర్మవరం మీదుగా నడవనుందన్నారు. అలాగే ధర్మవరం-మచిలీపట్నం (17216) రైలు ఈనెల 5, 10 తేదీల్లో ఇదే మార్గంలో నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

# ప్రతి మది మందిరమే!

- ఇప్పటికీ తలచుకొని మదనపడుతున్న ప్రజానీకం
- వైఎస్ హయాంలో జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి
- జలయజ్ఞంతో మెట్ట ప్రాంతాలకు కృష్ణా జలాలు
- నేడు వైఎస్ 14వ వర్ధంతి
- వాడవాడలా సేవా కార్యక్రమాలకు సన్నాహాలు



కురబలకోట మండలంలోని అంగళ్లుకు చెందిన బి క్రిష్ణారెడ్డికి రవితేజరెడ్డి ఒక్కడే కుమారుడు. చిన్న వయస్సులోనే తల్లి దూరమైంది. మూడో తరగతి చదువుతున్నప్పుడు హుషారుగా లేకుండా నలతగా ఉండేవాడు. వివిధ ఆసుపత్రులల్లో చూపించారు. పరీక్షలు చేసిన డాక్టర్లు రవితేజరెడ్డికి గుండె నరాలు దెబ్బతిన్నాయని, గుండె ఎడుగుదల సక్రమంగా లేదని చెప్పారు. ఇలాంటి తరుణంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించిన ఆరోగ్యశ్రీ పథకం వరంగా నిలిచింది. ఆపరేషన్ చేయడంతో కోలుకున్నాడు. వైఎస్సార్ భిక్షే పునర్జన్మకు కారణమైందని ఆయన రుణం తీర్చుకోలేదని క్రిష్ణారెడ్డి చెప్పారు.



ఆదినారాయణరెడ్డి




వెంకటసుబ్బమ్మ

ప్రొద్దుటూరులోని సంజీవనగర్‌లో నివాసం ఉంటున్న చౌటపల్లె ఆదినారాయణరెడ్డి దంపతులకు 2008లో ఒకే నెలలో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేశారు. ఏప్రిల్‌లో ఆయనకు గుండెపోటు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక వైద్యం చేసి వెంటనే హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడి మెడిసిటి హాస్పిటల్‌లో ఆపరేషన్ చేసి స్టంట్ వేశారు. నేను ఆరోగ్యంగా ఉన్నానంటే వైఎస్సార్ పెట్టిన భిక్షేనని ఆదినారాయణరెడ్డి చెబుతున్నారు. అదే నెలలో వెంకటసుబ్బమ్మకు ఆరోగ్యశ్రీ కింద థైరాయిడ్ ఆపరేషన్ జరిగింది. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయడంతో భార్యాభర్తలు ఇప్పుడు సంతోషంగా ఉన్నారు.

సాక్షి ప్రతినిధి కడప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాలు ఇప్పటికీ, ఎప్పటికీ మరువరానివి. ఫీజురీయింబర్స్‌మెంటు పథకం పేదల తలరాతలు మార్చివేసింది. అనారోగ్యపాలైతే వల్లకాడే దిక్కుగా ఉన్న పేదలకు ఆరోగ్యశ్రీ పథకంతో పునర్జన్మ కల్పించింది. ఇళ్లు లేని నిరుపేదలందరికీ గూడు కల్పించి వైఎస్సార్ వారి పాలిట కల్పవృక్షంలా నీడనిచ్చారు. అణగారిన వర్గాల ఉన్నతి కోసం రిజర్వేషన్లు కల్పించి చరిత్రను తిరగరాశారు. అరుగాలం శ్రమించినా ఫలితం దక్కని రైతన్నకు దన్నుగా నిలిచారు. వృద్ధులకు పెద్ద కొడుకుగా, వితంతువులకు సోదరుడిగా... ఇలా చెప్పుకుంటూపోతే ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు ఏదో ప్రయోజనం కల్పించిన ఘనత ఆయన సొంతమైంది. ఓవైపు పన్నులు లేకుండా మరోవైపు సంక్షేమ పాలన చేపట్టి, ప్రభుత్వ పాలనంటే ఇలా ఉండాలని భవిష్యత్ తరాలకు ఆయన ఆదర్శప్రాయుడుగా నిలిచారు. వెరసి ప్రతి హృదయము మందిరమే అయ్యిందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

**అరుదైన నాయకుడు....**

అచ్చతెలుగుదనం ఉట్టిపడే పంచెకట్టు, నడకలో ఠీవి, నమ్ముకున్న వారిని ఆదరించేగుణం, మాట తప్పని.. మడమ తిప్పని నైజం, అన్నదాతలు, కార్మిక, కర్షకుల కోసం పరితపించే గుణం, వీటన్నింటికీ మించి మోముపై చిరునవ్వు... ఈ లక్షణాలన్నీ కలగలిపి పుణికి పుచ్చుకున్న నాయకుడు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. అనంతపురం నుంచి అదిలాబాద్ వరకూ, శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా ఆ పేరు ఉచ్ఛరిస్తేనే మనస్సు పులికిస్తుంది. అందుకు కారణం రాజకీయాలకు అతీతంగా పేదలను ప్రేమించడం, వర్గాలకు, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా సమగ్రాభివృద్ధి చేయాలనే తపన ఉండడం. ప్రజల కోసం, ఎంతటి కష్టాన్నైనా భరించి సంక్షేమ పాలన చేపట్టడం. దాంతో మరుపురాని జ్ఞాపకంగా ప్రజానీకం గుండెలోతుల్లో కొలువయ్యారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి శనివారం ప్రజానీకం ఘనంగా చేపట్టేందుకు సన్నహాలు చేసుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.



**తండ్రిని మించి ఆరోగ్యశ్రీ అమలు...**

పేదల మదిలో వైఎస్ రాజశేఖరరెడ్డి సుస్థిర స్థానం సంపాదించారు. నేను సైతం పేదల పక్షపాతినేని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేశారు. తండ్రి కంటే రెండు అడుగులు ముందుంటానని స్వతహాగా వెల్లడించిన ఆయన ఆరోగ్యశ్రీని మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టారు. 3,255 రోగాలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చారు. రూ.5లక్షల వరకు ఆదాయం ఉన్న కుటుంబాలను సైతం ఆరోగ్యశ్రీ పథకంలోకి వర్తించేలా పథకాన్ని రూపొందించారు. మరోవైపు ఆరోగ్య ఆసరా పథకాన్ని తీసుకొచ్చారు. జబ్బుల బారిన పడిన వారి జీవనానికి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా రోజుకు రూ.225 చెల్లించేలా పథక రచన చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో రూ.550 కోట్లు వ్యయం భరించి 2.6లక్షల మందికి వివిధ వైద్య సేవలు ఉచితంగా అందించారు. ఆరోగ్య ఆసరా ద్వారా 1.2లక్షల మందికి సుమారు రూ.58 కోట్లు పైగా అందజేశారు.

**జిల్లా సమగ్రాభివృద్ధికి విశేష కృషి**

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే వరకు పాలకుల వివక్షతతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన కడప జిల్లా ఐదేళ్ల వైఎస్ హయాంలో సమగ్రాభివృద్ధి సాధించింది. ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యోగి వేమన యూనివర్సిటీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, పశువైద్య విద్య కళాశాలలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆస్పత్రి, దంత వైద్యశాల నిర్మించారు. ట్రిపుల్ ఐటీ, ఐజీ కార్ల్ (పశు పరిశోధన కేంద్రం), దాల్మియా సిమెంటు కర్మాగారం, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్, భారతి సిమెంటు కర్మాగారం, సజ్జల పాలిమర్స్ లాంటి పరిశ్రమలను నెలకొల్పారు. జలయజ్ఞం ద్వారా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పరుగులు పెట్టించారు. సుమారు రూ. 12 వేల కోట్లతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు. గాలేరు-నగరి సుజల ప్రవంతి, గండికోట కెనాల్, టన్నెల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలను వైఎస్సార్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆదునీకరణ, సర్వారాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, పైడిపాళెం, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాదే తెలుగుగంగ పనులను పూర్తి చేసి కృష్ణా జిల్లాలతో బ్రహ్మంసాగర్‌లో నింపి ఘనత సాధించారు. మెట్ట ప్రాంతాలల్లో కృష్ణా జలాలు పారుతున్నాయంటే అది ఆనాటి వైఎస్సార్ చలువే. ఎవరు ఏది అడిగినా కాదనకుండా అభయమిచ్చారని జిల్లావాసులు ఇప్పటికీ కొనియాడుతున్నారు.

### నేడు సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ జిల్లాకు రాక



కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

- ఉదయం 9.00 గంటలకు సీఎం తన నివాసం నుంచి బయలుదేరి 9.20 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9.30 గంటలకు విమానంలో బయలుదేరి 10.20 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.30 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.50 గంటలకు ఇడుపులపాయలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.00 గంటలకు వైఎస్సార్‌ఘాట్ వద్దకు చేరుకుంటారు.
- 11.05 గంటల నుంచి 11.25 గంటల వరకు ఘాట్ వద్ద నివాళులర్పిస్తారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.35 గంటలకు వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు.
- 11.35 నుంచి 12.05 గంటల వరకు రిజర్వు
- మధ్యాహ్నం 12.10 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి 12.15 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.15 నుంచి 12.30 గంటల వరకు స్థానిక నాయకులతో ముచ్చటిస్తారు.
- 12.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 12.55 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 1.00 గంటకు కడప నుంచి విమానంలో బయలుదేరి 1.50 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 2.00 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.20కి తన నివాస గృహానికి చేరుకుంటారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కౌలు రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

**జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్**

రాయచోటి: రైతు ఆనందంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరుసగా ఐదోఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు వైఎస్సార్ భరోసా, 2023 మే నుంచి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు ఇన్పుట్ సబ్సిడీని రైతుల ఖాతాలకు జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పంజం సుకుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్, జిల్లా హార్టికల్చర్ అధికారి రవిచంద్రబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా పప్పాయి, అరటి పంటలు సాగు చేయడం జరుగుతుందని, పంటవేసి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందజేయడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వీడియో కాన్ఫరెన్సు ద్వారా ముఖ్యమంత్రికి తెలియజేశారు. జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను కూడా సీఎంకు వివరించారు. రైతులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వవిప్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సుకోసం ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారన్నారు. రైతు చల్లగా ఉంటే రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశ్యంతో ఉచిత విద్యుత్, ఇన్పుట్ సబ్సిడీ, పెట్టుబడి రాయితీలను అందిస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు అందజేస్తోందన్నారు. రైతులందరూ ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో 1280 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 96 లక్షలను సీఎం బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగింది. అలాగే ఖరీఫ్ 2023 మే నుంచి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ 1326 మంది రైతులకు రూ. 2.12 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశారు. అనంతరం ముఖ్య అతిథులు మెగా చెక్కులను రైతులకు అందజేశారు.

### 108 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైవీయూ ఆరోగ్యకేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, వ్యవస్థాపక వీసీ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటులోనూ, అభివృద్ధిలోనూ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సహకారాన్ని, సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు 108 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య పి. చంద్రమతీశంకర్, ఆచార్య సి. నాగరాజు, డా. మాదక్క పాల్గొన్నారు.

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌జిల్లా మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోసియల్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె. హరి మధుసూదన్‌రావు, లింగాల మండలం గుణకనపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం. రాఘవేంద్రమ్మలు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయారు. ఈ నెల 5వ తేదీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. జిల్లా నుంచి ఇద్దరు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## పల్లె సంస్కృతులు ప్రతిబింబించేలా శిల్పారామం

**కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**

రామాపురం: సంస్కృతి సంప్రదాయం ఉట్టి పడేలా, పల్లె సంస్కృతులు ప్రతిబింబించేలా శిల్పారామం ఏర్పాటుచేస్తామని కలెక్టర్ గిరీషాపీఎస్, వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి సమీపంలోని రామాపురం మండలం బండపల్లెలో శిల్పారామం అభివృద్ధి పనులకు వారు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ బండపల్లి వద్ద 13.90 ఎకరాల్లో శిల్పారామం అభివృద్ధికి తొలి విడతగా రూ1.90 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సకల కళలకు నిలయంగా బండపల్లి శిల్పారామం ఉంటుందని తెలిపారు. పల్లె జీవనం, కులవృత్తులు, వ్యవసాయం కళ్లకు కట్టేలా శిల్పాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. పట్టణంలో నగరవనం, డైట్ హాస్టల్ పార్క్, క్రికెట్ స్టేడియం నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా రామాపురం మాజీ ఎంపీపీలు గడికోట జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు కర్ణపు విశ్వనాథరెడ్డి, వండాడి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫయాజ్ రెహమాన్, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సివిల్ సప్లైస్ స్టేట్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, కాంట్రాక్టర్లు కనపర్తి పెంచల్‌రెడ్డి, చెన్నారెడ్డి వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితరులు

**అన్ని పార్టీల సహకారంతో ఓటరు జాబితా**

రాయచోటి: అన్ని రాజకీయ పార్టీల సహకారంతో అన్నమయ్య జిల్లాలో పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పనకు కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో 'ఓటరు జాబితా రూపకల్పన'అంశంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ నాటికి జిల్లాలో 13,56,348 మంది ఓటర్లుండగా, ఇందులో 13,56,102 మంది వివరాలు భౌతికంగా పరిశీలించారన్నారు. 15 వేలమంది నూతన ఓటు కోసం దరఖాస్తు చేశారన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, ఆయా నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, తహశీల్దార్లు, వివిధరాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

- గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ కులవృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఈ పథకం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి అమలు కమిటీ అధికారులతో అవగాహన సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి అమలుతీరుపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయి నుంచి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిటీ సభ్యులు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజా, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, డీపీఓ ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## చిరుత సంచారంతో ప్రజల బెంబేలు

**వాల్మీకిపురం :** వాల్మీకిపురం పంచాయతీ శివపురం చేనేత కాలనీ, గొందికుంట ప్రాంతంలోని పొలాల్లో గత నాలుగు రోజులుగా చిరుత సంచరిస్తోందని రైతులు తెలిపారు. గొందికుంట ప్రాంతంలో తాము ప్రత్యక్షంగా చూశామని రైతులు చెబుతున్నారు. కొందరు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులకు చిరుత సంచారంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## చిలకవారిపల్లెలో గంజాయి మొక్క

**మదనపల్లె :** మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ పంచాయతీ చిలకవారిపల్లెలో గంజాయి మొక్కను శుక్రవారం డీటీఎఫ్ పోలీసులు గుర్తించారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన వ్యక్తుల నుంచి ఆరున్నర కిలోల గంజాయిని ఇటీవల స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారించగా చిలకవారిపల్లెలో ఓ ఇంటి వెనుక పెరట్లో ఏపుగా పెరిగిన ఒక గంజాయి మొక్క కనిపించిందని డీటీఎఫ్ ఎస్‌ఐ బాబు తెలిపారు.

## వివాహిత అదృశ్యం

**ములకలచెరువు :** మండల కేంద్రానికి చెందిన ఒక వివాహిత అదృశ్యంపై పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గాయత్రి కథనం మేరకు... రాగిమానుపల్లెలో కాపురం ఉంటున్న యం.భాస్కర్‌నాయక్ భార్య యం.అనిత(32) ఆగస్టు 30న రాత్రి భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రెండు రోజులుగా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త భాస్కర్ నాయక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## భార్యపై దాడి కేసులో భర్త అరెస్టు

**మదనపల్లె :** భార్యపై కత్తితో దాడిచేసిన రఘును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ ఎస్‌ఐ హేమాద్రి శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. పట్టణంలోని రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన లక్ష్మీదేవి, రఘు దంపతులు తోపుడుబండిపై పండ్ల వ్యాపారం చేసి జీవిస్తున్నారు. కుటుంబ సమస్యలతో భార్య భర్తకు దూరంగా బంధువుల ఇంట్లో ఉండడం, భర్తను పట్టించుకోక పోవడంతో గురువారం తెల్లవారుజామున రఘు ఆమెతో గొడవపడ్డాడు. కత్తితో విచక్షణా రహితంగా నడిరోడ్డుపై దాడి చేశాడు. రక్తపు మడుగులో స్పృహతప్పి పడిపోయింది. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతోంది. కుమారుడు బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



**డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (APVVP)**
జిల్లా వైద్యశాలల సేవల సమన్వయాధికారి వారి కార్యాలయం, పూర్వ చిత్తూరు జిల్లా
**పత్రికా ప్రకటన** తేది: 01-09-2023

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్), పూర్వ చిత్తూరు జిల్లా పరిధిలో గల ప్రభుత్వ ఆసుపత్రుల నందు ఖాళీగా ఉన్న పారా మెడికల్ ఇతర పోస్టులకు - 42 ఖాళీలు కాంట్రాక్టు మరియు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయుటకు దరఖాస్తులను 01-09-2023 నుండి 07-09-2023 సాయంత్రం 05.00 గంటల వరకు ఆహ్వానించడమైనది. పూర్తి వివరాలకు చిత్తూరు వెబ్‌సైట్ https://chittoor.ap.gov.in నందు పరిశీలించగలరు.

| క్రమ సంఖ్య | ఉద్యోగం పేరు | ఖాళీలు సంఖ్య | రోస్టర్ విధానం GO.Ms.No.77, GA(Ser-D) Dept, Dt:02-08-2023 | పోస్ట్ నింపే విధానం |
|---|---|---|---|---|
| 1 | ఫార్మసిస్ట్ గ్రేడ్-II | 10 | OC-5, BC-B-1, BC-D-2 EWS-1, SC-1 | కాంట్రాక్టు |
| 2 | ల్యాబ్ టెక్నీషియన్ | 1 | OC-1 | కాంట్రాక్టు |
| 3 | కౌన్సిలర్/యం.యస్. గ్రేడ్-II | 1 | BC-A-1 | అవుట్ సోర్సింగ్ |
| 4 | థియేటర్ అసిస్టెంట్ | 9 | OC-4, BC-D-2, BC-E-1, EWS-1, SC-1 | అవుట్ సోర్సింగ్ |
| 5 | ల్యాబ్ అటెండెంట్ | 3 | OC-2, SC-1 | అవుట్ సోర్సింగ్ |
| 6 | పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్ | 5 | OC-1, BC-A-1, BC-D-1 BC-E-1, SC-1 | అవుట్ సోర్సింగ్ |
| 7 | రికార్డు అసిస్టెంట్ | 1 | SC-1 | అవుట్ సోర్సింగ్ |
| 8 | జనరల్ డ్యూటీ అటెండెంట్స్ (GDA)/MNO/FNO | 10 | OC-6, BC-A-1, BC-E-1, ST-1, SC-1 | అవుట్ సోర్సింగ్ |
| 9 | ఆఫీస్ సబార్డినేట్ | 2 | OC-1, SC-1 | అవుట్ సోర్సింగ్ |
| | మొత్తం | 42 | | |

1.దరఖాస్తులు సమర్పించవలసిన చిరునామా జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి వారి కార్యాలయము, జిల్లా ఆసుపత్రి చిత్తూరు. 2. దరఖాస్తులు సమర్పించుటకు తేదీలు: 01-09-2023 to 07-09-2023 upto 5 PM 3. దరఖాస్తు వివరములకు వెబ్‌సైట్: https://chittoor.ap.gov.in

సం/- జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయాధికారి చిత్తూరు (మెంబర్ కన్వీనర్ డి.యస్.సి)
సం/-కలెక్టరు మరియు జిల్లా మెజిస్ట్రేట్ & చైర్మన్ జిల్లా సెలక్షను కమిటీ, చిత్తూరు

# ఆ ఇంట.. మృత్యుఘోష

**ఆరు నెలల్లోనే ముగ్గురు మృతి**





ఘటనాస్థలంలో అనుమానాస్పద స్థితిలో ఓబుల్‌రెడ్డి మృతదేహం (ఇన్‌సెట్) ఓబుల్‌రెడ్డి (ఫైల్)

**మదనపల్లె :** ఆ కుటుంబంలో ఏం జరుగుతోంది? ముందు ఉరి వేసుకుని కుమారుడు.. అతడి జ్ఞాపకాలతో తల్లి.. ఆపై అనుమానాస్పదంగా తండ్రి దుర్మరణం చెందడం స్థానికులను కలచి వేస్తోంది. ఒకరి వెంట ఒకరు ఆరు నెలల్లో మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మండలంలోని కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి, రమణమ్మ దంపతులకు కుమారుడు కిరణ్ కుమార్‌రెడ్డి, కుమార్తె మనీషా ఉన్నారు. కుమార్తెకు పెళ్లి చేసి అత్తారింటికి పంపారు. ఈ ఏడాది మార్చిలో కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఉరివేసుకుని మృతిచెందాడు. అతడి మృతిని జీర్ణించుకోలేక బయ్యారెడ్డి కాలనీకి ఓబుల్‌రెడ్డి దంపతులు మకాం మార్చారు. ఆగస్టు 11న ఓబుల్‌రెడ్డి భార్య రమణమ్మ కుమారుడి జ్ఞాపకాలు మరువలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడు, భార్య ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో మద్యానికి బానిసైన ఓబుల్‌రెడ్డి శుక్రవారం ఇంటి బాత్రూమ్ సమీపంలో మృతిచెంది పడి ఉన్నారు. స్థానికులు హత్యగా అనుమానించి, బంధువులకు, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తల వెనుక గాయం ఉండటాన్ని గుర్తించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఆరు నెలల వ్యవధిలో మృతి చెందడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'తన సోదరుడి కుటుంబానికి కాట్లాటపల్లె వద్ద రూ.3 కోట్ల విలువ చేసే పొలం ఉందని, ఆస్తి కోసం ఎవరైనా హత్య చేశారేమో.. విచారించాలని' మృతుడి సోదరుడు మీడియాకు తెలిపారు.

## సీఎం, ఎమ్మెల్యేపై దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు



వెంకటేశ్వరరెడ్డి

**బి.కొత్తకోట :** సీఎం, స్థానిక ఎమ్మెల్యేలను దుర్భాషలాడిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కే.రామమోహన్ తెలిపారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామంలోకి వెళ్తున్న అధికారులను అడ్డుకోవడమేకాక సీఎం, ఎమ్మెల్యేపై నోరుపారేసుకున్న వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు. బి.కొత్తకోట మండలం నాయనబావి పంచాయతీ దేవరాజుపల్లెలో గడప గడప మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓ శంకరయ్య సహా అధికారులు, సచివాలయ సిబ్బంది దేవరాజుపల్లెకు వెళ్లగా ఆ గ్రామస్తుడు ఎస్.వెంకటేశ్వరరెడ్డి అధికారుల వద్దకు వచ్చాడు. మాగ్రామంలోకి మిమ్మల్ని ఎవరు రమ్మన్నారని అధికారులను అడ్డుకుని వారిపై దుర్భాషలాడాడు. సీఎం, ఎమ్మెల్యేను తిడుతూ మా ఊరిలోకి రావొద్దని అడ్డుకుని విధులకు ఆటకం కలిగించాడు. పంచాయతీ కార్యదర్శి మధుకర్‌రెడ్డి తాను పంచాయతీ కార్యదర్శి అని సర్ది చెప్పినా వినకుండా గ్రామంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నాడు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ మధుకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి నిందితున్ని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

## విరోచనాలతో నలుగురికి అస్వస్థత



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

**తంబళ్లపల్లె :** మండలంలోని కోటకొండ పంచాయతీ కురవపల్లెలో నలుగురు విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. గ్రామానికి చెందిన ఆదినారాయణ(45), నాగమ్మ(80), మల్లమ్మ(60)లు తీవ్ర అసవస్థతకు గురై మదనపల్లె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగమల్లమ్మ(64) మదనపల్లె ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్పందించి శిబిరం ఏర్పాటు చేయాలని సూచించడంతో డాక్టర్ అనుపమ, మునికుమార్, సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. బోరు సమీపంలో మురుగు కాల్వ ఉండడం, పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడం విరోచనాలకు కారణమై ఉండవచ్చునని వారు తెలిపారు.

## నేడు గండిలో మూడో శ్రావణమాస ఉత్సవం



గండి వీరాంజనేయుడు

**చక్రాయపేట :** శ్రావణ మాసంలో గండి క్షేత్రంలో శనివారం ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఎక్కువమంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశామని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, ఛైర్మన్ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. రాత్రి బాలనాగమ్మ, రామాంజనేయ యుద్ధం నాటకాలు, భరత నాట్య ప్రదర్శన ఉంటాయన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతలు అన్నదానం చేస్తారన్నారు. పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. భారీ వాహనాలను గండిలోకి అనుమతించమన్నారు. వీఐపీలు, పాస్‌లు కలిగిన వారు ఉదయం, సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటలలోగా రావాలన్నారు.

## వలంటీర్‌ను దూషించిన వ్యక్తులపై కేసు నమోదు

**కలకడ :** వలంటీర్‌ను దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సిటి.స్వామి తెలిపారు. మండలంలోని వడ్డిపల్లెకు చెందిన బత్తల వెంకటేష్ కుమారుడు వెంకటరమణ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆగస్టు 30న ఇంటిపన్ను రసీదు మరోమారు కావాలని గ్రామానికి చెందిన ఇడగొట్టి శ్రీనివాసులు, అతడి కుమారులు నీలకంఠ, మణికంఠ డిమాండ్ చేశారు. పంచాయతీ అధికారులు ఇస్తారని తెలిపినా వినకుండా వాలంటీర్‌ను, అడ్డుపడిన అతడి తల్లిని దుర్భాషలాడారు. బాధితుడు వెంకటరమణ బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఇరు వర్గాల ఘర్షణ



జరిగిన ఘర్షణపై విచారిస్తున్న పోలీసులు

**సంబేపల్లి :** మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ బుర్రవాండ్లపల్లెలో శుక్రవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు గ్రామంలోని వ్యవసాయ బోరు పైపులైన్ విషయంపై ఇరువర్గాల మాటా మాటా పెరిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో దాడులు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో డ్రైవర్ హత్యపై విచారణ



సుధాకర్ (ఫైల్)

**పీలేరు రూరల్ :** స్థానిక కోటపల్లె పాఠశాల సమీపంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఆటో డ్రైవర్ సుధాకర్‌ను హత్య చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. సినీ ఫక్కీలో విష ప్రయోగం జరిగిందనే అనుమానంతో మృత దేహాన్ని పరీక్షల నిమిత్తం తిరుపతి రుయాకు తరలించినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్షల అనంతరం బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. పోస్టుమార్టం రిపోర్టు అనంతరం హత్యకు గల కారణాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు చెప్పారు.

## 2023-24 ఎస్‌జీఎఫ్ షెడ్యూల్ విడుదల

**కడప ఎడ్యుకేషన్ :** జిల్లాలో 2023–24 సంవత్సరంలో పాఠశాల క్రీడలకు సంబంధించిన షెడ్యూల్‌ను స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి, డీఈఓ రాఘవరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. సెప్టెంబర్ 2వతేదీ నుంచి 10వతేదీ వరకు ఆయా మండలాల్లో అండర్–14, అండర్–17 బాయ్స్, గర్ల్స్‌కు సంబంధించిన టోర్నమెంట్ మరియు సెలెక్షన్స్ మండల కో ఆర్డినేటర్లు నిర్వహించాలని సూచించారు. 11వతేదీ నుంచి 20వతేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో, అనంతరం 21వతేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు జిల్లాస్థాయిలోనూ పోటీలు ఉంటాయన్నారు.

## పోలీసులకు బాలుడి అప్పగింత



గుర్రంకొండ మదరసాలో బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

**చిన్నమండెం :** మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బీహార్‌కు చెందిన మహమ్మద్ సల్మాన్‌ను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలో ఓ బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించడంతో గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. వారు వివరాలు ఆరా తీయగా తనది బీహార్ రాష్ట్రమని, తండ్రి హమీద్ అని బాలుడు తెలిపాడన్నారు. దీంతో జిల్లా శిశు హక్కుల సంరక్షణ అధికారికి సమాచారం తెలిపి గుర్రంకొండ మదరసాలో చేర్పించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

## అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



బాలాజీ(ఫైల్)

**మదనపల్లె :** ఇంట్లో ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణంలో శుక్రవారం జరిగింది. బాబూ కాలనీకి చెందిన హనుమంతు కుమారుడు టి.బాలాజీ(28) ఆటో నడుపుతూ జీవిస్తున్నారు. తండ్రి హనుమంతు ఆరోగ్యం దెబ్బతినడంతో దాదాపు రూ.3 లక్షల వరకు పలువురి వద్ద అప్పుచేశాడు. అప్పు కట్టాలంటూ ఇటీవల ఒత్తిడి అధికమవడంతో మానసికంగా కుంగిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

## మద్యం బాబును బతికించిన ఫోన్



జోసెఫ్‌తో ప్రొద్దుటూరు పోలీసులు దామోదర్, గురుశేఖర్

**ప్రొద్దుటూరు క్రైం :** మొబైల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపితే.. ఆరోగ్యం పాడవుతుందని వైద్యులు చెబుతారు. ఇందుకు భిన్నంగా కాల్వలో పడిపోయిన మద్యంబాబు ప్రాణాలు కాపాడింది సెల్‌ఫోన్. సత్యసాయి జిల్లాకు చెందిన జోసెఫ్ ప్రొద్దుటూరులో వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా మోడంపల్లెలో నివాసముంటున్నారు. శుక్రవారం మద్యం తాగి ఆ మత్తులో రైల్వే స్టేషన్ సమీపంలోని మురుగు కాలువలో పడిపోయారు. అతడు కనిపించలేదని టూటౌన్ సీఐ ఇబ్రహీంకు బంధువులు ఫిర్యాదు చేశారు. అతడి వద్ద సెల్‌ఫోన్ ఉందని చెప్పడంతో లోకేషన్ గుర్తించి గాలించారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్లు తెలిసి సీఐ ఇబ్రహీం హుటాహుటిన కానిస్టేబుళ్లు దామోదర్, గురుశేఖర్‌లను పంపి స్థానికుల సాయంతో బయటికి తీయించారు. అర్ధరాత్రి సమయంలో ప్రొద్దుటూరుకు తీసుకువచ్చి వైద్యం అందించిన తర్వాత కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.



## కండీషన్ బెయిల్‌పై ష్యూరిటీలు సమర్పించిన టీడీపీ నాయకులు

**మదనపల్లె :** కురబలకోట మండలం అంగళ్లులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు యుద్ధభేరి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా జరిగిన అల్లర్లకు సంబంధించి ముదివేడు పోలీసులు టీడీపీ జాతీయఅధ్యక్షులు చంద్రబాబు, మాజీ మంత్రి దేవినేనిఉమా, జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారికిషోర్‌కుమార్‌రెడ్డి, చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జ్ పులివర్తి నానిపై కేసు నమోదుచేశారు. దీనిపై ఆయా నాయకులు హైకోర్టులో పెట్టుకున్న బెయిల్ పిటిషన్లపై కండిషన్ బెయిల్ మంజూరైంది. బెయిల్‌కు సంబంధించి మదనపల్లె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ష్యూరిటీలు సమర్పించాల్సి ఉండటంతో శుక్రవారం నల్లారికిశోర్‌కుమార్‌రెడ్డి, పులివర్తినానిలు సీఐ శివాంజనేయులు ఎదుట హాజరయ్యారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసి బెయిల్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద టీడీపీ నాయకులకు స్వాగతం పలికేందుకు స్థానిక నాయకులు హంగామా చేశారు.

## జెడ్పీలో 3న గురుపూజోత్సవం

**కడప ఎడ్యుకేషన్ :** ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఆపుస్మ) కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించనున్న ఆపుస్మ కడపజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగయ్య, పీవీ రమణారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఈఓ రాఘవరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాల్లోని ప్రవేటు పాఠశాలల్లో పనిచేస్తూ ప్రతిభ కనబరుస్తున్న 100 మంది ప్రైవేటు టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

## వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య



సుమతి(ఫైల్)

**బద్వేలు అర్బన్ :** అదనపు కట్నం తేవాలంటూ భర్త పెట్టే వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బద్వేల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల ఫిర్యాదు మేరకు సి.కె.దిన్నె మండలం శివాజీ నగర్‌కు చెందిన సుబ్బయ్య, ఇందిరమ్మ దంపతుల కుమార్తె పోలుసుమతి(24)ని పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన బాలుడు అనే యువకుడికి ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అన్యోన్యంగా సాగిన వీరి కాపురంలో ఇటీవల మనస్పర్థలు పెరిగాయి. అదనపు కట్నం తేవాలని తరచూ భర్త బాలుడు వేధించడమేగాక, గురువారం రాత్రి సుమతితో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురైన ఆమె అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో...



మృతి చెందిన శాంతి

**మైదుకూరు :** మైదుకూరు మండలం బసవాపురం ఎస్సీ కాలనీలో కటారి శాంతి(20) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. దువ్వూరు మండలం మాచనపల్లె గ్రామానికి చెందిన శాంతిని మైదుకూరు మండలం బసవాపురం ఎస్సీ కాలనీకి చెందిన కటారి చెన్నయ్య ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేశారు. వీరిరువురు బంధువులే అయినా పెళ్లి తర్వాత శాంతికి పుట్టింటితో రాకపోకలు లేవు. అయితే ఇటీవల శాంతి, భర్త కుటుంబీకులకు మధ్య వివాదం జరగడంతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తన బిడ్డను అత్త, భర్త చంపి ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని తల్లి మార్తమ్మ మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైదుకూరు తహసీల్దార్ అనురాధ, శాంతి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఏఎస్‌ఐ పాండురంగారెడ్డి తెలిపారు.

## ప్రతి భారతీయుడికీ పాలసీ ఇవ్వాలన్నదే లక్ష్యం



లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్‌డీఎం గిరిధర్, ఇతర అధికారులు

**ఎల్ఐసీ ఎస్‌డీఎం.గిరిధర్**

**కడప కల్చరల్ :** ప్రతి భారతీయుడికి ఒక ఎల్‌ఐసీ పాలసీ అందివ్వాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకోసం 13 లక్షల మంది ఏజెంట్లు, 98 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని ఎల్‌ఐసీ కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. కడప డివిజనల్ కార్యాలయం ఆవరణలో బీమా వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్సూరెన్స్ వ్యాపారంలో ఎల్‌ఐసీ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందన్నారు. 2023 జూన్, 30 నాటికి ఎల్‌ఐసీ రూ.46 లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉందని, రూ.9543 కోట్ల లాభాలు సాధించిందని తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌సుందర్ రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ప్రారంభమయ్యే బీమా వారోత్సవాలు 7న ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సత్యశ్రీనివాస్, సత్యప్రసాద్, ఆనందరావు, యల్లారెడ్డి, సంజయ్, రఘునాథరెడ్డి, సుధీకర్, రెడ్డిభాస్కర్, జయభారతరెడ్డి, అధికారులు లక్ష్మీనారాయణ రెడ్డి, రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

## చీనీ సూట్ ధరలపై అవగాహన



మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమీషనర్

**సింహాద్రిపురం :** మండలంలోని గురజాల గ్రామంలో శుక్రవారం చీనీ రైతులు, వ్యాపారులకు చీనీ సూట్ ధరలపై అవగాహన కల్పించారు. మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి చొరవతో పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల, వేముల మండలాల్లో 15 రైతు భరోసా కేంద్రాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నామని తెలిపారు. చీనీ సూట్‌ను శాశ్వతంగా నిర్మూలించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఎవరైనా వ్యాపారులు రైతులకు సరైన మద్దతు ధర ఇవ్వకపోయినా, చీనీ పంటలో సూట్ తీసుకునా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రాజశేఖర్, పులివెందుల, సింహాద్రిపురం మార్కెట్ చైర్మన్లు చిన్నప్ప, రామ్మోహన్‌రెడ్డి, బోర్డు సభ్యుడు శివ, ప్రసాద్‌రెడ్డి, డీహెచ్ఓ మైఖేల్ రాజీవ్, అధికారులు పాల్గొన్నారు.

## వైవీయూలో పాలకమండలి సభ్యులు



వైవీయూ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పాలకమండలి సభ్యులు

**వైవీయూ :** యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన పాలకమండలి సభ్యులు ఆచార్య పి.చంద్రమతీశంకర్, డా.మాదక్క, పి.ముబీనాబేగం, డాక్టర్ వై.ప్రమోదలు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైవీయూ విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అత్యున్నత పాలకమండలిలో పని చేసే అవకాశం లభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు వీసీ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అల్ హబీబా కళాశాల కరస్పాండెంట్ పి.అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.